www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 23 | జనవరి | 2025
పేజీలు 8

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం



-పొరపాట్లను సరిచేసి పూర్తి జాబితాను తక్షణమే ప్రకటించండి
-గ్రామ సభలో అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే కూనంనేని

2లో

# గ్రామసభల్లో అర్హుల ఆవేదన..!





రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాలుగు పథకాల లబ్దిదారుల ఎంపికపై గడిచిన రెండు రోజులుగా జరుగుతున్న గ్రామసభల్లో అర్హులు తమను లబ్దిదారులుగా ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నాలుగు పథకాలకు సంబంధించి అర్హుల ఎంపికలో గందరగోళం నెలకొంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు సంబంధించి రైతు భరోసాపై పెద్దగా ఆరోపణలు లేవు. ఒకట్రెండు చోట్ల సాగుభూమిగా నమోదు కాకపోతే అధికారుల దృష్టికి తీసుకు రావడం అధికారులు లబ్దిదారులుగా చేరుస్తామని హామీ ఇవ్వడంతో సమస్య ముగిసిపోతుంది.

-ప్రజాపక్షం/ఖమ్మం

**లబ్ధిదారులుగా ఎంపిక చేయకపోవడంపై గందరగోళం**

**తొందరపడొద్దు పరిశీలిస్తామంటున్న అధికారులు**

2లో





## ఇందిరమ్మ ఇళ్లు ఇస్తారా.. సెల్‌టవర్ పైనుంచి దూకమంటారా..!




### నాగిలిగొండలో సెల్ టవర్ ఎక్కిన శ్రీను

ప్రజాపక్షం/చింతకాని : తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరీ చేస్తారా సెల్‌టవర్ పై నుంచి దూకమంటారా అంటూ నాగిలిగొండ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికుడు పామర్తి శ్రీను బుధవారం గ్రామంలోని ఓ సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపాడు.ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా ఇటీవల అధికారుల సర్వేలో శ్రీను కు గతంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని తెలిపారు. 2008లో తన భార్య పేరుతో ఇందిరమ్మ ఇల్లు మంజూరైతే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తమకు తెలియకుండా తమ పేరున ఇందిరమ్మ ఇల్లు కట్టుకున్నారని గత వారం క్రితం సెల్ టవర్ ఎక్కి నిరసన తెలపగా చింతకాని ఎస్సై నాగుల్ మీరా,తహసీల్దార్ కూరపాటి అనంతరాజులు సముదాయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి టవర్ నుంచి దింపారు.

మిగతా 2లో..

## ఎవరూ అధైర్యపడొద్దు




-నిజమైన అర్హులను ఎంపిక చేసేందుకు మరలా గ్రామసభలు
-ఏ పైరవీలు అవసరం లేదు
-26న నాలుగు పథకాలు ప్రారంభిస్తాం
-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాపక్షం/నేలకొండపల్లి : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన నాలుగు సంక్షేమ పథకాలు గురించి ఎవరు అధైర్యపడవద్దు అని నిజమైన అర్హులను ఎంపిక చేసేందుకు మరలా గ్రామ సభలు నిర్వహిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహం నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. మండలం లోని మోటాపురం, కోరట్లగూడెం, కోనాయిగుడెం, పైనంపల్లి, అప్పల నరసింహంపురం, కోంగర, కట్టుకచారం, బుద్దారం గ్రామాలలో పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం నిర్వహించారు. తొలుత మోటాపురం గ్రామంలో గ్రామ పంచాయతీ నూతన భవనం ను సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన నాలుగు సంక్షేమ పథకాలను ఈ నెల 26న ప్రారంభించనున్నట్లు తెలిపారు. నిజమైన అర్హులను ఎంపిక చేసేందుకు

మిగతా 2లో..

# గ్రామసభల్లో అర్హుల ఆవేదన

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాలుగు పథకాల లబ్దిదారుల ఎంపికపై గడిచిన రెండు రోజులుగా జరుగుతున్న గ్రామసభల్లో అర్హులు తమను లబ్దిదారులుగా ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నాలుగు పథకాలకు సంబంధించి అర్హుల ఎంపికలో గందరగోళం నెలకొంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు సంబంధించి రైతు భరోసాపై పెద్దగా ఆరోపణలు లేవు. ఒకట్రెండు చోట్ల సాగుభూమిగా నమోదు కాకపోతే అధికారుల దృష్టికి తీసుకురావడం అధికారులు లబ్దిదారులుగా చేరుస్తామని హామీ ఇవ్వడంతో సమస్య ముగిసిపోతుంది. కానీ అతిపెద్ద గందరగోళానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రేషన్ కార్డుల జారీ విషయంలో మాత్రం అర్హులకు దక్కకుండా అనర్హులకు దక్కాయన్న ఆవేదన వ్యక్తమవుతుంది. కొణిజర్ల మండలంలో రెండవ రోజు నిర్వహించిన గ్రామసభలో పథకాల లబ్దిదారుల జాబితా చదువుతున్నప్పుడు ఆయా గ్రామాల ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. సిద్దిక్‌నగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు ఒకే ఇంట్లో ఇద్దరికి వచ్చాయని భూమి ఉన్న వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేశారని ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. అధికారులను టెంట్ నుంచి బయటకు పంపి టెంట్ పడేసి నిరసన వ్యక్తం చేశారు. లక్ష్మీపురం, మల్లుపల్లి, గోపారం, గుండ్రాతిమడుగు గ్రామాల్లో కూడా అర్హులైన వారికి పథకాలు రాలేదని గ్రామస్తులు ఆందోళన చేశారు. పెద్దమునగాలలో ప్రజలకు, అధికారులకు మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. రఘునాథపాలెం మండలం చిమ్మపుడి, రఘునాథపాలెం గ్రామాల్లో అనర్హులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేశారని నిరసన వ్యక్తం చేశారు. అర్హులకు రాకపోగా అనర్హులకు రావడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బోనకల్ మండలంలోనూ అదే పరిస్థితి నెలకొంది. చింతకాని మండలం నాగిలిగొండ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో కొందరు నేతలు అసలు లబ్దిదారులకు తెలియకుండానే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించి అందుకు సంబంధించిన నిధులను కాజేశారు. ఆ విషయం తెలుసుకున్న బాధితుడు ఆందోళన చేయగా న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. బుధవారం నాగిలిగొండ గ్రామసభలో వెల్లడించిన జాబితాలో బాధితుని పేరు లేకపోవడంతో తిరిగి సెల్ టవర్ ఎక్కి ఆందోళన చేస్తున్నాడు. వైరా మండలం రెబ్బవరం గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి 160 మందిని ఎంపిక చేస్తే అందులో 42 మందికి భూములు ఉన్నాయని వారిని ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. మొత్తంగా అధికారుల జాబితాకు వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉండడంతో అధికారులు ప్రజలను శాంతపరిచే పని చేస్తున్నారు. ఫిర్యాదులు ఉంటే లిఖితపూర్వకంగా అందజేస్తే అర్హులను ఎంపిక చేస్తామని భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. నిజమైన లబ్దిదారులను ఎంపిక చేసేందుకు గ్రామసభలను నిర్వహిస్తున్నామని చెబుతున్నప్పటికీ ఎక్కడో తయారు చేసిన జాబితాను చదివి వినిపిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా పథకాల ఎంపికకు సంబంధించి గ్రామసభల్లో గందరగోళం నెలకొంది. అమలు నాటికి పరిస్థితి ఏవిధంగా ఉంటుందో వేచి చూడాలి మరీ.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకొని అర్హుల జాబితాలో పేర్లు నమోదికాని లబ్దిదారులు ఆందోళన చెందొద్దని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు, తెల్ల రేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గ పరిధిలో రెండోరోజు నిర్వహించిన వార్డు, గ్రామ సభల్లో ఆయన పాల్గొని లబ్దిదారుల ఎంపిక ప్రక్రియని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కూనంనేని అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజాపాల గ్రామసభల్లో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులపై సర్వే నిర్వహించిన అధికారులు అర్హుల జాబితాను ప్రకటించారని, పూర్తి స్థాయిలో జాబితాలో అర్హులను చేర్చకపోవడంతో ఆందోళనకు గురి అవుతున్నారన్నారు. గ్రామ సభల్లో కొత్తగా స్వీకరించిన దరఖాస్తులకు తక్షణమే సర్వే చేపట్టి పూర్తి స్థాయిలో జాబితాను సిద్ధం చేసి ప్రకటించాలని అధికారులకు సూచించారు. ప్రకటించిన అర్హుల జాబితాలో జగిరిన పొరపాట్లను సరి చేయాలని సూచించారు. ఏ ఒక్క అర్హుడికి అన్యాయం జరిగినా ఉపేక్షించేది లేదని, వివాదాలు లేని జాబితాను సిద్ధం చేసి ప్రజల ముందుంచే భాధ్యత అధికారయంత్రంగం పై ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, తహసీల్దార్ పుల్లయ్య, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి, రెవిన్యూ, మున్సిపల్ శాఖ అధికారులు, కౌన్సిలర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎవరూ అధైర్యపడొద్దు



(మొదటిపేజీ తరువాయి)

మరలా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహిస్తామని అన్నారు. నాలుగు పథకాలకు జాబితాలో పేర్లు రాకపోతే ఎవరు కూడా అధైర్యపడవద్దని అన్నారు. నాలుగు రోజుల పాటు విడతల వారిగా ఆయా గ్రామాల్లో జరిగే గ్రామసభలలో దరఖాస్తులు చేసుకుని వారిలో నిజమైన అర్హులు ఉంటే వారికి వెంటనే పథకాలు అందించటం జరుగుతుందని అన్నారు. రెచ్చగొట్టే మాటలను ఈ ప్రభుత్వం పట్టించుకోదని, చిత్తశుద్ది తో పని చేయటమే ఈ ప్రభుత్వంకు తెలుసు అన్నారు. ప్రతి గ్రామ సభ లో కొందరు ఉద్దేశపూర్వకంగా కావాలని మాట్లాడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వం ఏనాడూ కూడా గ్రామ సభలో నిర్వహించలేదని అన్నారు. అర్హులైన వారికి ఇల్లు ఇస్తామని ఏ పైరవీ అక్కర్లేదు అన్నారు. ఇప్పుడు ఇచ్చే అప్లికేషన్ లో అర్హులైన వాటిని కూడా పరిశీలిస్తామని అన్నారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని అన్నారు. పర్యటనలో భాగంగా కొంగర గ్రామం వద్ద నాట్లు వేసే కూలీల వద్ద ఆగి వారితో ముచ్చటించారు. అక్క చెల్లి అంటూ ఆప్యాయంగా పలకరించారు. నేను ఉన్నది హైదరాబాద్ లో నైనా చిన్నతనంలో నాన్నతో నారాయణపురం లో వ్యవసాయం పనులు చేశానని పేర్కొన్నారు. అంతకు ముందు మోటాపురం గ్రామంలో మంత్రి ని గజమలతో కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ కార్పోరేషన్ చైర్మన్ మువ్వ విజయబాబు, ఆర్డీవో నరసింహా రావు, స్పెషల్ ఆఫీసర్ రమేష్, సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, కాంగ్రెస్ నాయకులు స్వర్ణకుమరి, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, నెల్లూరి భద్రయ్య, బొడ్డు బోందయ్య, బచ్చలికూర నాగరాజు, రావెళ్ల కృష్ణా రావు, జెర్రిపోతుల అంజనీ, బోయిన వేణు, కుక్కల హనుమంత రావు, పెంటమళ్ల పుల్లమ్మ, మరికంటి రమేష్, మేకల వెంకటేశ్వర్లు, పాకనాటి సంగీత, మధు, విజయ్ బాబు, పర్వత కనకయ్య, కడియల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు ఇస్తారా.. సెల్‌టవర్ పైనుంచి దూకమంటారా..!

(మొదటిపేజీ తరువాయి)

అనంతరం పంచాయతీ కార్యదర్శితో విచారణచేయించి అదే గ్రామానికి చెందిన పామర్తి కళావతి భర్త శ్రీనివాసరావుకు తప్పుడు పత్రాల ద్వారా ఇల్లు నిర్మించుకున్నాడన్న విషయాన్ని తహసీల్దార్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. భాధితుడు పామర్తి శ్రీను కలెక్టర్‌ని కలవగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బుధవారం జరిగిన గ్రామసభలో తన పేరు లబ్దిదారుల జాబితాలో రాకపోవడంతో మరోసారి మనస్థాపంతో సెల్‌టవర్ ఎక్కి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరీ చేస్తే తప్ప లేకపోతే దిగనని కూర్చున్నాడు. తహసీల్దార్ అనంతరాజు,ఎస్సై నాగులమీరా,ఎంపీడీవో రామయ్య సంఘటనా స్థలంలో ఉండి భాధితుడిని టవర్ నుంచి దింపే ప్రయత్నం చేస్తున్నా శ్రీను ససేమీరా అంటున్నాడు.

## టియుడబ్ల్యూజె (ఐజెయు) డైరీని ఆవిష్కరించిన కలెక్టర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (టియుడబ్ల్యూజే) ఐజేయు డైరీని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆవిష్కరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో యూనియన్ డైరీని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కులు, సమస్యల కోసం పోరాడుతున్న యూనియన్ పనితీరును ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, స్తంభాద్రి జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, ఉపాధ్యక్షులు మైసా పాపారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఉపాధ్యక్షులు మామిడాల భూపాలరావు, టియుడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు మోహినుద్దీన్, నగర కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్, జనార్ధనాచారి, కళ్యాణ్, సత్యనారాయణ, మేడి రమేష్, బుర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# అర్హులందరికీ పథకాల లబ్ధి

-జాబితాలో పేర్లు లేవని ఆందోళన వద్దు
- ఖమ్మం 28వ డివిజన్ సభలో కలెక్టర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వం చేపట్టబోయే నాలుగు సంక్షేమ పథకాల లబ్ధి అర్హులందరికీ అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని 28వ డివిజన్ ప్రకాష్‌నగర్‌లో నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. డివిజన్ ప్రజలు తమ సందేహాలను కలెక్టర్‌ను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, రేషన్ కార్డుల అప్‌డేట్లపై కలెక్టర్ స్పష్టంగా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అర్హులందరినీ ఎంపిక చేసి పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రాథమికంగా ప్రకటించిన జాబితాలో ఒకట్రెండు మిస్సయిన ఎటువంటి ఆందోళన అవసరం లేదని, దరఖాస్తు అందిస్తే వాటిని విచారించి పథకాల లబ్ధి చేకూరుస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో ఎవరికైనా సొంత ఇండ్లు ఉండి ఉంటే సమాచారం అందిస్తే విచారణ చేస్తామని ఇండ్లు ఉన్న వారి పేర్లు తొలగించడం జరుగుతుందన్నారు. 2023లో వచ్చిన ప్రజాపాలన దరఖాస్తులు, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలు, మీ సేవ దరఖాస్తులను క్రోడీకరించి కొత్తగా రేషన్‌కార్డులు అందించేందుకు జాబితాను సిద్ధం చేశామని ఈ జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. రేషన్ కార్డులకు అర్హులు ఇంకా ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజాపాలనలో వచ్చిన ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే సేకరణ వివరాలు ఇప్పుడు వచ్చిన అప్లికేషన్లను పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గజ్జెల లక్ష్మి వెంకన్న, డివిజన్ ప్రత్యేకాధికారి, మున్సిపల్ ఏఈ బాబు, అధికారులు పాల్గొన్నారు.




**20 డివిజన్లలో సభలు...**

నాలుగు నూతన పథకాలకు సంబంధించి ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో బుధవారం 21వ డివిజన్ నుంచి 40వ డివిజన్ వరకు మొత్తం 20 డివిజన్లలో ప్రజాపాలన వార్డు సభలు నిర్వహించారు. ఈ వార్డు సభల్లో ఆయా డివిజన్ల ప్రత్యేకాధికారులు, వార్డు ఆఫీసర్లు, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మేయర్ పునుకొల్లు నీరజ పలు డివిజన్లలో నిర్వహించిన సభల్లో పాల్గొన్నారు. నాలుగు పథకాలకు సంబంధించి సభల వద్ద హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

## లంకాసాగర్ పిహెచ్‌సి హెల్త్ అసిస్టెంట్ మృతి

**ప్రజాపక్షం/పెనుబల్లి:** మండల పరిధిలోని లంకాసాగర్ పిహెచ్‌సి లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడడంతో మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. లంకాసాగర్ పిహెచ్‌సి లో హెల్త్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న సత్తెనపల్లి రవికుమార్ (45) గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాడు. ఒత్తిడి తట్టుకోలేక సోమవారం సాయంత్రం కలుపు మందు తాగి ఆత్మహత్య పాల్పడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే ఖమ్మం వైద్యం కొరకు తరలించి మెరుగైన వైద్యం కొరకు హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. సత్తుపల్లికి పట్టణానికి చెందిన సత్తెనపల్లి రవి పెనుబల్లి మండలంలోని లంకాసాగర్ పిహెచ్‌సి పరిధిలో అందరికి సుపరిచితుడు. గత కొన్ని రోజుల క్రితం సిఆర్‌పి చేసి ప్రాణాలు కాపాడిన ఉద్యోగి కలెక్టర్ చేత ప్రశంస పత్రం అందుకున్నారు. మృతుని కుటుంబంలో కొద్ది రోజుల్లో శుభకార్యం ఉండగా ఇలా జరగటం దురదృష్టకరమని వైద్యులు కిరణ్ కుమార్, లంకాసాగర్ పిహెచ్‌సి తోటి సిబ్బంది విచారం వ్యక్తం చేసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని వారు తెలిపారు.



# ఫిబ్రవరి 10లోపు మద్దులపల్లి మార్కెట్ అందుబాటులోకి..



**- మంత్రులు పొంగులేటి, తుమ్మల ఆదేశాలతో శరవేగంగా పనులు**
**- విలేకరుల సమావేశంలో**
**మద్దులపల్లిమార్కెట్ కమిటీచైర్మన్ బైరు హరినాథ్‌బాబు**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్‌:** మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో మద్దులపల్లి మార్కెట్‌ని రైతుల సౌకర్యార్థం ఫిబ్రవరి 10లోపు అందుబాటులోకి తీసుకువస్తామని, మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు అన్నారు. బుధవారం ఖమ్మంరూరల్ మండలం మద్దులపల్లిపంచాయతీపరిధిలో గల మార్కెట్‌యార్డులో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఖమ్మం నగరంలోని మార్కెట్‌ను ఆధునీకరణ చేస్తుండటంతో రైతులకు మద్దులపల్లి మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు శరవేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. ఎన్‌ఎస్‌పీ భూమిపై ఉన్న అడ్డంకులు తొలగిపోయాయని, ఆ భూమిని రెవిన్యూ ఆధ్వర్యంలో మార్కెట్‌కు అప్పగించనున్నారన్నారు. మార్కెట్ ప్రారంభోత్సవంతో పాటు కార్యాకలాపాలు కొనసాగడంలో కావాల్సిన మెకానిజంపై మార్కెట్ పాలకవర్గం ఆధ్వర్యంలో తీర్మానం చేసినట్టు తెలిపారు. మద్దులపల్లి టు మార్కెట్, ఆటోనగర్ టు మార్కెట్, గొల్లగూడెం టు మార్కెట వరకు ఉన్న ఉన్న ఈ మూడు మట్టి రోడ్లను 100అడుగులు, డివైడర్‌తో డంబర్ రోడ్లు నిర్మానం జరుగుతుందన్నారు. దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో ఆర్అండ్‌బి శాఖ ఎస్టిమేషన్ కూడా వేశారన్నారు. రూ.37కోట్ల వ్యాయాయంతో నిర్మించనున్న రోడ్ల ప్రపోజల్ ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. కావున త్వరితగతిన సబంధిత పనులు సైతం ప్రారంభం కానున్నాయని, రైతులు మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ తేజావత్ పంతుల్‌నాయక్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్య సురేష్ నాయక్, కందుకూరి వెంకటనారాయణ, ఏటుకూరి సుధాకర్, మండల నాయకులు గునిగంటి సురేష్, కళ్లెం శేశిరెడ్డి, కొక్కు రాజు తదితరులు పాల్గొన్నారు.

# రసాభాసగా పోలీస్ బందోబస్తు మధ్య రెబ్బవరం గ్రామసభ

**-అనర్హుల ఎంపిక పట్ల ఆగ్రహం**
**-అర్హులను ఎందుకు ఎంపిక చేయలేదంటూ నిలదీసిన గ్రామస్తులు**





**ప్రజాపక్షం/వైరా :** వైరా మండలం రెబ్బవరం గ్రామంలో ప్రత్యేక అధికారి కష్టాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ప్రజా పాలన గ్రామ సభ రసాభాసగా మారింది. ఒక్కసారిగా గ్రామ ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి నిలదీశారు. గ్రామంలో ఎంపిక చేసిన లిస్టులలో అర్హులకు చోటు లేకుండా అనహరులను ఎంపిక చేశారని తీవ్ర ఆగ్రహంతో గ్రామసభ అధికారి వద్దకు తోసుకొనే వెళ్లారు. మహిళలు తీవ్ర ఆగ్రహంతో ఎవరు ఎంపిక చేశారు. ఎవరు లిస్టులు ప్రకటించారు అంటూ నిలదీశారు. ఇందిరమ్మ భరోసా ఆత్మీయ భరోసా కార్యక్రమంలో భూమిలేని నిరుపేదలకు ఉపాధి హామీ పనికి వెళ్లే వారికి సంవత్సరానికి 12000 రూపాయలు అందిస్తామని లబ్ధిదారులు ఎంపిక జరుగుతుందని చెప్పిన ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఎంపికలో పూర్తిగా భుములు ఉన్న వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ఎంపిక కింద లిస్టులో ఎంపిక చేయడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో 160 మందిని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఎంపిక చేస్తే అందులో 42 మంది భూములు ఉన్నవారేనని వారిని ఏ విధంగా ఎంపిక చేశారు అని నిలదీశారు. మరోపక్క గ్రామంలో సర్వే కేవలం గుమ్మస్తాలతో చేపించారని గుమ్మస్తాలు వారికి నచ్చిన వారి పేర్లు లిస్టులో చేర్పించే విధంగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి పోలీస్ బందోబస్తు మధ్య గ్రామ సభను నిర్వహించారు. ఈ గ్రామ సభలో తహాసిల్దార్ శ్రీనివాస రావు, ఎంపీడీవో సరస్వతితోపాటు అధికారులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీలో ప్రశాంతంగా గ్రామ సభలు



**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 4, 8, 10, 11, 12, 13, 14 వార్డులలో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. నాలుగో వార్డు నందు ప్రజా పాలన గ్రామసభ బుధవారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ చింత వేణు అధ్యక్షుడు జరిగిన గ్రామ సభలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ లబ్ధిదారుల ఎంపిక గురించి మాట్లాడుతూ, ఇందిరమ్మ పాలనలో ప్రతి ఒక్కరికి అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అందుతుందని, గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ప్రజలు సంక్షేమ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఇప్పుడు రాష్ట్రంలో సంక్షేమ పండగ నడుస్తుందని ఆయన అన్నారు. అదే విధంగా లిస్టులో పేరు లేని వారు అధైర్య పడవద్దని ప్రతి గ్రామ సభలో మరల దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, బోళ్ల గంగారావు, ఎస్‌కె. మున్ని, ఏఈ శ్రీ మాన్య, ముబిబా, పాణ్యం భాస్కర్, గూడా రజిని తదితరులు పాల్గొన్నారు. 8వ వార్డులో గ్రామ సభలో పాల్గొన్న చైర్మన్ జైపాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డ్ లో జరిగిన గ్రామసభలో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అవార్డు కౌన్సిలర్ కన్నెగంటి సునీత తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు అర్హుల లబ్ధిదారుల లిస్టు చదివి వినిపించారు. కమిషనర్ చింతా వేణు అధ్యక్షుడు జరిగిన ఈ గ్రామ సభలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు కమిటీ సభ్యులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. గండగలపాడు పదో వార్డులో గ్రామ సభ ప్రత్యేక అధికారి ఇటుకల భాస్కర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అవార్డు కౌన్సిలర్ కర్నాటి నందిని మాట్లాడుతూ, ప్రజలు లిస్ట్ లో పేర్లు రానివారు మరల దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం దరఖాస్తుదారుల ఎంపికను అధికారులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారుల భాస్కర్ మాట్లాడుతూ, ప్రజాపాలన గ్రామసభలో లిస్టులలో పేరు రానివారు అధైర్య పడవలసిన అవసరం లేదని మరల గ్రామసభలో దరఖాస్తు చేసుకోండి అధికారులు అర్హులని లిస్టులో చేరుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కమిటీ సభ్యులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. 11 వార్డులో జరిగిన గ్రామసభ లొ కమిషనర్ చింత వేణు అధ్యక్షతన జరిగిన సభలో మున్సిపల్ కౌన్సిలర్ పవిత్ర కుమారి పాల్గొన్నారు .ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఎంపిక లిస్టును చదివి వినిపించారు. 13వ వార్డులో జరిగిన గ్రామసభలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు పాల్గొన్నారు ప్రత్యేక అధికారి ఇటుకల భాస్కర్ లబ్ధిదారులు ఎంపిక లిస్టు చదివి వినిపించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు మాట్లాడుతూ, లిస్టులో పేర్లు రానివారు మరల దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ సిబ్బంది వార్డు అధికారులు పాల్గొన్నారు. 14 వార్డులో జరిగిన గ్రామసభలో కౌన్సిలర్ డాక్టర్ కోటయ్య పాల్గొన్నారు. ప్రత్యేక అధికారి ఇటుకుల భాస్కర్ లబ్ధిదారులు ఎంపిక లిస్టు వినిపించారు. ఈ సందర్భంగా ఇంద్రమ్మ కమిటీ సభ్యులు పమ్మి అశోక్ మాట్లాడుతూ లిస్ట్లో పేర్లు రానివారు ఎవరైనా ఉంటే మరల దరఖాస్తు చేసుకోవాలని ఇందిరమ్మ పాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని సూచించారు.

# మండలవ్యాప్తంగా గందరగోళంగా గ్రామసభలు



**ప్రజాపక్షం/ఏన్కూరుః** మండలంలో రెండో రోజు గ్రామసభలు బుధవారం వాడివేడిగా సాగాయి. ఆయా గ్రామాల్లో ప్రజలు అక్కడక్కడ నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన ఏన్కూరు, జన్నారం, జన్నారం ఎస్టీ కాలనీ, కేసుపల్లి, మేడేపల్లి, పికె.బంజర, రేపల్లెవాడ, తిమ్మారావుపేట, ఎర్రబోడుతండా గ్రామాల్లో మండల అధికారులు గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభల్లో అక్కడక్కడ అర్హులు పేర్లు లేవని, అనర్హుల పేర్లు ఎక్కువగా ఉన్నాయని అధికారులను ప్రజలు నిలదీశారు. ఇందిరమ్మ ఇళ్ళు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల్లో తమ పేర్లు లేవంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ జాబితాలో పేర్లు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారందరికి దశలవారీగా పథకాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ గ్రామసభలో మండల ప్రత్యేక అధికారి సాయినాథ్, మండల అభివృద్ధి అధికారి సకినాల రమేష్, తహాశీల్దార్ శేషగిరిరావు, ఎంపివో నారాయణ, మండల వ్యవసాయ అధికారి నర్సింహారావు, ఏఈవో లహరి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సాగర్ జలాలను విడుదల చేయాలి



**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ స్థానిక మండల కేంద్రంలో సిరిపురం మేజర్‌కు సాగర్ నీరు విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం తల్లాడ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేసి స్థానిక ఎన్ఎస్పి అధికారికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి నల్లమోతు మోహన్‌రావు మాట్లాడుతూ వారబందీ పద్ధతిలో నీరు వదలడం వలన పంటలు ఎండిపోతున్నాయని, నీరు వదలిన సమయంలో కూడా తక్కువ మోతాదులో వదలడం వలన పొలాలకు నీరు సరిగ్గా అందటం లేదని, ఫలితంగా వరి మెట్టపైర్లు ఎండిపోతున్నాయన్నారు. సాగర్‌లో నిండుగా నీరు ఉన్నా అస్తవ్యస్తంగా ఉన్న ప్రభుత్వ తీరుతో రైతులు తీవ్ర నష్టపోతున్నారని, వెంటనే సంబంధిత అధికారులు వారబందీ పద్దతిని ఎత్తివేసి విరామం లేకుండా సాగర్‌నీటిని ఇచ్చి రైతుల పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు కళ్యాణ కృష్ణయ్య, సీనియర్ నాయకులు సాయన్న ప్రకాశ్‌రావు, అయినాల రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, అనుమోలు కృష్ణయ్య, కర్లకంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నిధులతో సిసి రోడ్డుకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/ తల్లాడ :** సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ నిధులతో మంజూరైన సిసి రోడ్డుకు బుధవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో ఇజిఎస్ నిధుల ద్వారా రూ.6.50లక్షల సిసి రోడ్డుకు గోపాలపేట మాజీ సర్పంచ్ నల్లమోతు మోహన్‌రావు, కాంగ్రెస్ నాయకులు కొమ్మినేని వెంకటేశ్వరరావు, పొన్నం కృష్ణయ్య శంకుస్థాపన చేశారు. బండి నాగేశ్వరరావు ఇంటి నుండి ఈ రోడ్డు వేయనున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సిసి రోడ్డు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు సూదా నర్సింహారావు, శనక్కాయల నాగయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపూడిలో ఇందిరమ్మ ఇల్లు అర్హులకు ఇవ్వాలి



**ప్రజాపక్షం/వైరా :** ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాలుగు పథకాలలో ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ, అలాగే రేషన్ కార్డులు పథకాల గురించి గొల్లపూడి గ్రామంలో గ్రామ ప్రజా పాలన గ్రామ సభ నిర్వహించినారు. ఈ గ్రామ సభలో ఇందిరమ్మ ఇల్లు గురించి పరిపాలన అధికారి లిస్టు చదువుగా లిస్టులో ఉన్న పేర్లు మొత్తం గతంలో ఇల్లు ఉన్న వారికే మంజూరైనాయని, ఈ లిస్టు ఒకవైపే నడిచిందని ఇది అసలైన లిస్టు అర్హులది కాదని సిపిఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు అధికారులను నిలదీశారు. ఈ లిస్టు ను రద్దు చేస్తూ మరోసారి గొల్లపూడి గ్రామంలో రీ సర్వే చేసి ఇందిరమ్మ ఇల్లు నిజమైన అర్హులకు మంజూరు చేయలి అని వినతి పత్రం అందజేశారు. అసలైన అర్హులు కీ రాకపోగా అర్హత లేని వారి పేర్లు లిస్ట్ లో చేర్చి చదివారని వీటిని వెంటనే రిజెక్ట్ చేసి రీ సర్వ్ చేసి అర్హులైన లబ్ధిదారులకి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలి. గ్రామ సభలో గ్రామ పరిపాలన అధికారి గకు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గంజిని పోయిన తిరుమలయ్య, వెంపటి పరశురాములు, కంజనుబోయిన రామారావు తదితరులు పాల్గొన్నారు.

# రామబాణానికి ఎదురులేదు.. శంకర్‌రెడ్డికి తిరుగులేదు...

**-100శాతం బీఆర్‌టియూ మిత్రపక్షాలదే గెలుపు**
**-కార్మికుల సంక్షేమం బీఆర్‌టియూ మిత్రపక్షాలకే సాధ్యం**
**-బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు**





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రామబాణానికి ఎదురు లేదు...శంకర్‌రెడ్డికి తిరుగు లేదని ఈనెల 31న సారపాక ఐటీసీ పీఎస్పీడీలో జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో వందకు వందశాతం బీఆర్‌టియూ మిత్రపక్షాలదే గెలుపు అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. బుధవారం బీఆర్‌టియూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌టియూ మిత్రపక్షాలు 14వ వేతన ఒప్పందం కోసం 14అంశాలను మేనిఫెస్టోలో ప్రవేశపెట్టి విజయం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. గత గుర్తింపు సంఘాలు బీఆర్‌టియూ మిత్రపక్షాలకు అనుభవం లేదంటున్నారని అవును కరెక్టే అనుభవం లేదు కానీ విజ్ఞానం, సత్తా ఉందని, మంచి చేసిన సంఘానికి కార్మికులు ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. ఇప్పటికే సగం విజయం ఖాయమైందని మిగిలిన సంఘాల నుండి కొందరు ఇప్పటికే బీఆర్‌టియూ మిత్రపక్షాలకు టచ్‌లో ఉన్నారన్నారు. నిబద్ధత, నిజాయితీతో కార్మికుల సంక్షేమానికి పాటు పడే సంఘం బీఆర్‌టియూ మాత్రమేనన్నారు. సీనియర్ నాయకులు, అనుభవజ్ఞులు, అనేక కంపెనీల్లో అగ్రిమెంట్లు చేసిన సీనియర్ నాయకుల సపోర్ట్ బీఆర్‌టియూకు ఉందని 100శాతం సమస్యలను పరిష్కరించగల సత్తా బీఆర్‌టియూకు ఉందన్నారు. బీఆర్‌టియూ మిత్రపక్షాలు క్యాంప్ ఆఫీస్ అధికారికంగా ఏర్పాటు చేసి యూనియన్లతో సంబంధం లేకుండా నిజాయితీగా కార్మికులకు సర్వీస్ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మేనిఫెస్టోలో ప్రధానంగా కార్మికుల సంక్షేమం కోసం 14అంశాలకు రూపొందించడం విజయం సాధించడం తథ్యమన్నారు. ప్రతిపక్ష కార్మిక సంఘాలు బీఆర్‌టియూ మిత్రపక్షాలపై చేసే ఆరోపణలు, అవాకులు చెవాకులు ఎవరూ నమ్మవద్దని, కార్మికులకు అండగా నిలిచే సంఘం, వారికి సంక్షేమం అందించే సంఘం బీఆర్‌టియూ మిత్రమేనన్నారు. తొలుత బీఆర్‌టియూ ఎన్నికల ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభించారు. విలేకరుల సమావేశం అనంతరం బీఆర్‌టియూ మిత్రపక్షాలు, కార్మికులతో సమావేశం నిర్వహించి ఎన్నికల్లో గెలుపుపై చర్చించారు. ఈసమావేశంలో బీఆర్‌టియూ జిల్లా అధ్యక్షులు సానికొమ్ము శంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్పి అజీమ్, వర్కింగ్ ప్రెసిడెంట్ డి హరినార్, సీఐటియూ అధ్యక్షులు కె ప్రవీణ్, సీఐటియూ ప్రధాన కార్యదర్శి ఎం వెంకటేశ్వర్లు, ఐఈయూ ప్రధాన కార్యదర్శి ఎండి సాబీర్, ఐఈయూ అధ్యక్షులు శిక్షావలి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఆర్గనైజేషన్ బాధ్యులు నర్సింహారావు, డి ప్రశాంత్, బహుజన నాయకులు మధుమహరాజ్, శ్రీపాద రవికుమార్, గద్దల నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, నాయకులు బొల్లు సాంబశివరావు, కొనకంచి శ్రీనివాస్, బెజ్జంకి కనకాచారి, బిట్రా సాయిబాబా, పూర్ణ, లక్ష్మి చైతన్యరెడ్డి, ఆంజనేయులు, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

# షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అందించాలి

**- సీపీఐ రాష్ట్ర సమితి ముత్యాల విశ్వనాథం**





**ప్రజాపక్షం / పాల్వంచ :** అర్హులైన పేదలందరికీ షరుతులు లేకుండా సంక్షేమ పథకాలు అందించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం కోరారు. బుధవారం మండల పరిధిలోని బంద్రుగొండ సీపీఐ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం నాలుగు గ్యారెంటీ అమలు కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలో ప్రకటించిన అర్హత జాబితాలో సాంకేతిక కారణాలతో అనేక మంది పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాల జాబితాలో పేర్లు రాలేదని అన్నారు. అధికార యంత్రాంగం నిష్పక్షితంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేవిధంగా సర్వే చేపట్టాలని కోరారు. కొత్తగూడెం నియోజకవర్గ శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు సహకారంతో పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందెందుకు సీపీఐ కృషి చేస్తుందని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు సంసిద్ధం కావాలని, సీపీఐది వందేళ్ల చరిత్ర అని మరో వందేళ్లేనా చెక్కు చెదరకుండా ప్రజాక్షేత్రంలో మనగలుగుతామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పార్టీ పటిష్టకోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం బంద్రుగొండ సీపీఐ నూతన శాఖ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, ముత్యాల కిరణ్‌కుమార్, కట్టే సీతారాములు, మల్లికార్జున్, వెంకటయ్య, కట్టే వీరేష్, నేల్లెలా రమణయ్య, నాగశేషు, గోవర్ధన్, వగ్గేల పద్మ తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల దీక్షలు




**ప్రజాపక్షం / పాల్వంచ టౌన్ :** తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల కనవ్వర్షన్ చేయాలని ఐక్యవేదిక పిలుపులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నిరసన నిరహార దీక్షలు బుధవారం మూడవ రోజుకు చేరింది. ఈ దీక్షకు 1535 యూనియన్ నాయకులు, కేటీపీఎస్ రీజినల్ కార్యదర్శి దానయ్య మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడతూ.. విద్యుత్ ఆర్టిజన్ కార్మికులకు 1535 యూనియన్ ఎల్లవేళలా సంఘీభావం, సహకారం ఉంటుందన్నారు. ప్రభుత్వం విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# రసవత్తరంగా గ్రామ సభలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి** మండలంలోని వివిధ గ్రామాలలో బుధవారం జరిగిన గ్రామ సభల రసవత్తంగా జరిగాయి. గ్రామ సభలలో గ్రామస్తులు అధికారులను నిల దీశారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలలో అర్హులైన వారికి చాలా వరకు రాలేదని అధికారులతో స్థానికులు వాగ్వివాదం కు దిగారు. అరుపులు, కేకల నడుమ గ్రామ సభ రసవత్తరంగా జరిగింది. బోదులబండ సభలో పథకాల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా జరగలేదని మాజీ సర్పంచ్ కట్టెకోల నాగేశ్వర రావు, స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో స్పెషల్ ఆఫీసర్, మండల పంచాయతీ అధికారి శివ తో ఘర్షణ కు దిగారు. గ్రామస్తులు ఎంత చెప్పిన వినిపించుకోకుండా అరుపులు, కేకలతో సభలో నిరసన వ్యక్తం చేశారు. మంగాపురంతండా అరుపులు, కేకలతో గ్రామ సభ నిర్వహించారు. మండలం లోని కొంగర, కోనాయిగూడెం, శంకరగిరితండా, తిరుమలపురంతండా, కొరట్లాగూడెం, తదితర గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు.

# ఫిబ్రవరి 6 నుండి పెద్దమ్మతల్లి ఆలయ పంచమ పుష్కర (షష్టాబ్ది) మహాకుంభాభిషేకం

**-పెద్దమ్మగుడి ఆవరణలో నూతన శివాలయం ప్రతిష్ట**

**-ఎమ్మెల్యే కూనంనేని చేతుల మీదగా వాల్ పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరణ**



**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి కేపి,జగన్నాధపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి) ఆవరణలో నూనతంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ శివాలయం ప్రతిష్ట, శ్రీ అమ్మవారి ఆలయ నిర్మాణం జరిగి 60 సంవత్సరాలు పూర్తి అయినందున అమ్మవారి ఆలయ పంచమ పుష్కర ( షష్టాబ్ది) మహా కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమం ఫిబ్రవరి 06 గురువారం నుండి ఫిబ్రవరి 10వ తేదీ సోమవారం వరకు 5 రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారిని ఎన్.రజనీకుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబధించిన వాల్ పోస్టర్లు, కరప్రతాలను కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు చేతుల మీదగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. తొలుత దేవస్థాన అర్చకులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు ఆశీర్వచనంతో పాటు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదం అందచేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారిని ఎన్.రజనీకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండల పరిధిలోని కళ్యాణపురం గ్రామ పంచాయితీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈసందర్భంగా గ్రామ సభను ప్రారంభించి, ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్రామ సభలను ప్రభుత్వ అధికారులకు ప్రజలు సహకరించాలని, ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లును కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లును అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, అశ్వాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శీతల శవపేటిక బహూకరణ



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం వాస్తవ్యులు మణుగూరు భారజల కర్మగార ఉద్యోగి కొర్లకుంట విజయ పరమేశ్వరావు దంపతులు అశ్వాపురం గౌతమినగర్ కాలనీ వాసుల సౌకర్యార్థం శీతల శవ పేటికను బుధవారం వితరణగా అందజేశారు. హెవీ వాటర్ ప్లాంట్ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ సొసైటీకి ఈ శీతల శవపేటికను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యదర్శి వై అజయ్‌కుమార్, గేమ్స్ సెక్రటరీ కందుల శ్రీనివాసరావు, సూపర్వైజర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గడ్డం రమేష్, ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, సిహెచ్ సత్యనారాయణ, వీరస్వామి, రమేష్, నాగప్రసాద్, దాసరి భిక్షం, ఎలేషా, లక్ష్మి నారాయణ, కాలనీ సివిల్ ఎలక్ట్రికల్ సెక్షన్, హాస్పటల్ స్టాప్ పాల్గొన్నారు.

# ట్రైటా వైస్ ప్రెసిడెంట్‌గా ఇస్లావత్ రవి



**ప్రజాపక్షం/కారేపల్లి:** తెలంగాణ ప్రభుత్వ గిరిజన గురుకుల విద్యాలయాల ఉద్యోగుల సంఘం విద్యా సదస్సు బాబు జగ్జీవన్ భవన్ హైదరాబాద్‌లో జరిగింది. ఇందులో భాగంగా ట్రైటా రాష్ట్ర స్థాయి నాయకత్వమును ఎన్నుకున్నారు. రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా సింగరేణి గిరిజన గురుకులం ఉపాధ్యాయులు ఇస్లావత్ రవిను ఎన్నుకున్నారు. రవి మాట్లాడుతూ గురుకుల ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర స్థాయిలో పరిష్కారానికి కృషి చేస్తానని ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని, ఉద్యోగుల సంక్షేమం, హక్కుల కోసం రాష్ట్ర స్థాయిలో పని చేస్తానని తెలియజేస్తూ మాకు ఈ బాధ్యతలను అప్పగించిన గిరిజన గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగులకు, ట్రైటా రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

# ప్రశాంతంగా, రసాభాసగా గ్రామసభలు



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలోని మాణిక్యారం గ్రామంలో ప్రజాపాలన సదస్సులో అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందటం లేదని ఆగ్రహంతో గ్రామ సభలో అధికారులను గ్రామస్తులు నిలదీశారు. సింగరేణి మండలంలో నిర్వహించిన గ్రామ సభలలో కొన్ని చోట్ల ప్రశాంతంగా జరగగా, మరికొన్ని చోట్ల రసాభాసగా మారాయి, కుమ్మగూడెం, మాణిక్యారం తండాలో అనర్హులను ఎంపిక చేశారంటూ లబ్దిదారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసాపై అధికారులు చేపట్టిన గ్రామ సభలు రసాభాసగా మారాయి. క్షేత్రస్థాయిలో సర్వే చేయకుండా ప్రభుత్వం ముందే జాబితా ఎలా ప్రకటించిందంటూ ప్రజలు ప్రశ్నించారు. కొన్ని చోట్ల ప్రభుత్వ ఉద్యోగులకు , భూస్వాములకు పథకాలు కేటాయించడంపై ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. చాలా గ్రామాల్లో సభలు అర్ధాంతరంగా ముగిశాయి. అటు సభల్లో చదివే జాబితా అర్హులరి కాదని, దరఖాస్తుదారులదని భట్టి చెప్పారు.

# గ్రామసభల్లో గందరగోళం

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : నాలుగు పథకాల అమలుకు సంబంధించి రఘునాథపాలెం మండలంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామ సభల్లో గందరగోళం నెలకొంది. అధికారులు ప్రదర్శించిన ప్రాథమిక జాబితాలో అర్హులను కాదని అనర్హులను ఎంపిక చేశారంటూ గ్రామసభల్లో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. బుధవారం మండల పరిధిలోని చిమ్మపుడి, ఈర్లపుడి, వీఆర్ బంజర, పంగిడి, పరికలబోడు తండా, రఘునాథపాలెం, రాంక్యాతండా, రేగులచలక, పువ్వాడ నగర్, సూర్యాతండా గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీ య భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులకు సంబంధించి ప్రాథమికంగా ఎంపిక చేసిన అర్హుల జాబితాను ప్రదర్శించారు. గ్రామ సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయా పథకాలకు సంబంధించి అర్హులైన వారిని ఎంపిక చేయకుండా కాంగ్రెస్ పార్టీ వారినే ఎంపిక చేశారని గ్రామస్తులు ఆరోపించారు. రఘునాథపాలెం, చిమ్మపుడి, రాంక్యాతండా, పువ్వాడ నగర్ గ్రామసభల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. రఘునాథపాలెంలో రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోయిన బాధితులకు ఇండ్లు మంజూరు కాలేదని ఆస్తులు ఉన్న వారికి ఎలా ఇండ్లు మంజూరు చేశారంటూ అధికారులను ప్రశ్నించారు. రఘునాథపాలెం గ్రామసభలో జెడ్పి డిప్యూటీ



సిఈవో నాగపద్మజ, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఎంపిడివో అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. పథకాలకు సంబంధించి జాబితాలో అవకతవకలు ఉన్నాయని అనర్హులను ఎలా ఎంపిక చేశారంటూ అధికారులను నిలదీశారు. దీంతో అధికారులు ఎటువంటి సమాధానం చెప్పకుండానే సభ నుంచి వెళ్లిపోయారు. దీంతో కొంత ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. సిఐ ఉస్మాన్ షరీఫ్ ఆధ్వర్యంలో ఎటువంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. గ్రామసభల్లో నాలుగు పథకాలకు సంబంధించి హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/భద్రాచలం : ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కొత్తగూడెం నియోజకవర్గంలోని లక్ష్మీ దేవి పల్లి మండల పరిధిలోని అనిశెట్టిపల్లిలో రెండు రోజు జరిగిన గ్రామసభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు నాలుగు పథకాల లబ్దిదారుల జాబితాను చదివి వినిపించారు.తర్వాత అభ్యంతరాలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాటాల్లడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రైతుభరోసా, రేషన్ కార్డులు అందుతాయని, నిబంధనలకు అనుగుణంగా పథకాలను వర్తింప జేస్తామని చెప్పారు. అర్హుల జాబితాలో పేరులేనివారు ఆందోళన చెందనవసరం లేదని, గ్రామసభల్లో ప్రత్యేక కౌంటర్లు పెట్టి దరఖాస్తులు తీసుకుని అర్హత మేరకు పథకాలు వర్తింపజేస్తారని తెలిపారు. లేని పక్షంలోఎంపిడిఓ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఉంటాయని, దరఖాస్తులు అక్కడ అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పివి చలపతిరావు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామపంచాయితీ కార్యదర్శి, సంబంధిత అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఇల్లెందులో మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన

ప్రజాపక్షం/భద్రాచలం : జిల్లాలోని ఇల్లెందు నియోజకవర్గంలో రెవెన్యూ, సమాచారా పౌరసంబంధాల శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేయడంతో పాటు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం ఆర్అండ్‌బి రోడ్ న ఉండి రాగబోయిన గూడెం వరకు 1.5 కి.మీ బీటీ రోడ్ పనులకు శంఖుస్థాపన చేశారు. అనంతరం రూ.1కోటితో నిర్మించిన డిజిటల్ గ్రంథాలయాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం రూ.4 కోట్లతో చేపట్టనున్న బుగ్గవాగు సుందరీకరణ పనులకు మంత్రి శంఖుస్థాపన చేశారు. ఇల్లెందు పట్టణంలోని 22వ వార్డులో సిసిరోడ్, డ్రైనేజీ నిర్మాణ పనులకు, మునిపల్ అతిథిగృహ నిర్మాణ పనులకు మంత్రి శంఖుస్థాపన చేశారు. అనంతరం పోకాలరోడ్డ్‌లోని సెంట్రల్ లైటింగ్‌ను మంత్రి ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన స్విమ్మింగ్ పనులను ఆయన పరిశీలించారు. 23 వార్డులో 1.31కోట్లతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ కోరం కనకయ్యతో పాటు పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలి

ప్రజాపక్షం/చింతకాని : కోమట్లగూడెం గ్రామాభివృద్ధికి ప్రభుత్వం మరిన్ని నిధులు మంజూరి చేయాలని సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు ఉపాధిహామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సీమల అభివృద్ధిపై దృష్టి సారించిందని గ్రామల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా రేషన్‌కార్డులు,ఇందిరమ్మ ఇండ్లు,ఆత్మీయభరోసా మంజూరీ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వేపూరి రవీంద్రబాబు, చింతకాని సహకార సంఘం అధ్యక్షులు కొండపల్లి శేఖర్‌రెడ్డి, నాయకులు బాబుల్‌రెడ్డి , వేముల జానకిరాములు, వెంకట్రామిరెడ్డి, చాట్ల చంద్రం, అంకాలు, వనం చిన్నప్ప, పంచాయతీ కార్యదర్శి రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి



## భద్రాచలంలో నేడు గ్రామసభ

ప్రజాపక్షం/భద్రాచలం : ప్రజాపాలనలో భాగంగా నేడు భద్రాచలంలో గ్రామసభ నిర్వహించనున్నారు. స్థానిక గ్రామపంచాయితీ కార్యాలయ ఆవరణలో జరగనున్న ఈ కార్యక్రమానికి ఇఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు సమక్ష్యంలో జరిగే ఈకార్యక్రమానికి ఆర్డీఓ దామోదర్ రావు, తహశీల్దార్ శ్రీనివాస్, ప్రత్యేకాధికారి పాల్గొంటారు. ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రైతుభరోసా, రేషన్ కార్డుల కోసం ప్రజలు ఇప్పటికే పెట్టకున్న దరఖాస్తులను పరిశీలించి జాబితా తయారు చేసిన అధికారులు గ్రామసభలో చదివి వినిపిస్తారు. అర్హులైనప్పటికీ జాబితాలో పేరు లేని వారికి అక్కడే ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆ దరఖాస్తుల ఆధారంగా ఇంటి సర్వే నిర్వహించి అర్హులని తేలితే వారికి కూడా పథకాలు వర్తింపజేస్తారు. గ్రామసభ సజావుగా జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

# రాష్ట్రానికే ఆదర్శం సత్తుపల్లి మున్సిపాలిటీ





పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించిన మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే సండ్ర

ప్రజాపక్షం/సత్తుపల్లి: తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శంగా సత్తుపల్లి మున్సిపాలిటీ పని చేసిందని కొనియాడారు టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యలు. బుధవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ నందు సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ గా ఈ నెల 27న పదవి విరమణ చేయబోతున్న కూసంపూడి మహేష్, మున్సిపల్ కౌన్సిలర్‌లను మాజీ మున్సిపల్ శాఖ మంత్రి కేటిఆర్, మాజీ ఎమ్మెల్యే సండ్రలు ఘనంగా సన్మానించారు. సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ పరిపాలనలో సత్తుపల్లి మున్సిపాలిటీ సండ్ర వెంకట వీరయ్య ప్రోత్సాహంతో రాష్ట్రానికే ఆదర్శంగా నిలుపుతూ, మున్సిపాలిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసి ప్రజలలో చెరగని ముద్ర వేసుకొని నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ మున్సిపాలిటీ అభివృద్ధి కొరకు అహర్నిశలు శ్రమించిన చైర్మన్ మహేష్, కౌన్సిలర్‌లను ప్రత్యేకంగా కేటీఆర్ అభినందించారు. ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామ సభల్లో ప్రభుత్వాన్ని గ్యారంటీలపై నిలదీస్తున్నారని, గ్రామ సభలకు వేసిన టెంట్లను కూడా ప్రజలు కోపంతో పీకేస్తున్నారని త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వంకు ప్రజా వ్యతిరేకత స్పష్టంగా తెలుస్తుందన్నారు. సత్తుపల్లిలో సండ్ర వెంకట వీరయ్య, ఖమ్మం లో పువ్వాడ అజయ్ ఓడిపోవడంతో ఆ నియోజక వర్గ ప్రజలు ఎంతో కోల్పోయారని, గ్రామాలు , పట్టణాల్లో కేసీఆర్ హాయంలో జరిగినన్నీ పనులు గతంలో ఎపుడూ జరగలేదని, తెలంగాణ ప్రభుత్వం ఏర్పడక ముందు మున్సిపాలిటీ కి రూ. 50 లక్షలు కేటాయిస్తే గొప్ప అనుకునే పరిస్థితి ఉండేదని, కానీ కేసీఆర్ హయంలో ఆ పరిస్థితి మారి పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధి జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ గ్రందాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపాలిటీ చైర్మన్ మహేష్, అయూబ్ పాషా, అద్దంకి అనీల్, కృష్ణారావు, రఘు, తడికమళ్ళ ప్రకాష్, నర్సింహారావు, వీరపనేని రాధికబాబి, రూత్ క్రిష్టియానా, మహ్మద్ అనీష్ అబ్దుల్లా, రాజ్యల, భవాని, చింతల రమాదేవి, మాటూరి భాను తదితరులు పాల్గొన్నారు.

## భేటీ బచావో భేటీ పడావో దశాబ్ది ఉత్సవాలు

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : భేటీ బచావో భేటీ పడావో దశాబ్ది ఉత్సవాలను ఖమ్మం నగరంలోని ఎన్నెస్పి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. బుధవారం జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ర్యాలీ, డ్యాన్స్ కాంపిటేషన్లు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయ కర్త ఎస్‌డి సమీనా భేటీ బచావో, భేటీ పడావో ప్రతిజ్ఞ, అవగాహన కల్పించారు.





బాల్య వివాహాల వల్ల చదువు ఆగిపోవడం జరుగుతుందన్నారు. అర్థవంతమైన పని లేకపోవడం వల్ల పేదరికాన్ని అనుభవించాల్సి వస్తుందని తెలిపారు. చిన్న వయస్సులోనే వివాహాలు జరగడం వల్ల ప్రసవం కష్టం కావడం, ప్రసూతి మరణాలు, శిశు మరణాలు అధికంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రమీల, సతీష్, అక్బర్ సలీం, టి. నాగేంద్ర, రాజేంద్రప్రసాద్, రాధిక, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : పోలీసు అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయం చేస్తానన్నారు. వారి సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఏశోబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం వెంకటేశ్వర్లు, జానిమియా, మోహన్‌రావు, పంతులు తదితరులు పాల్గొన్నారు.



## వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎస్‌పి

ప్రజాపక్షం/భద్రాచలం : జిల్లా పోలీస్ అధికారుల వార్షిక క్యాలెండర్‌ను ఎస్‌పి రోహిత్ రాజ్ బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. ఎలాంటి సమస్య ఎదురైన తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్‌పి సత్యనారాయణ, కార్యాలయ ఏఓ మంజ్య నాయక్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, హోంగార్డు ఆర్ఐ నర్సింహారావు, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావు, ఉపాధ్యాక్షుడు ఏశోబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం వెంకటేశ్వర్లు, జానిమియా తదితరులు పాల్గొన్నారు.



# గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

**-కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గణతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఈనెల 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఫ్లాగ్ హోస్టింగ్ చేస్తారని తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా జరిగే జిల్లా స్థాయి వేడుకల్లో జాతీయ సమైక్యతను తెలియజేస్తూ మూడు కల్చరల్ ప్రోగ్రామ్‌లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ విద్యాశాఖాధికారికి సూచించారు. గణతంత్ర వేడుకల డయాస్, సిటింగ్ ఏర్పాట్లు పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పకడ్బందీగా చేయాలని ఖమ్మం అర్బన్ తహసీల్దార్‌ను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం సిటింగ్ ఏర్పాటు చేయాలని దీనిని అప్రమత్తంగా నిర్వహించాలన్నారు. జనవరి 26 నుంచి నూతనంగా ప్రారంభమయ్యే పథకాలకు సంబంధించి స్టాల్స్ ఏర్పాటు చేయాలని, మోడల్ ఇందిరమ్మ ఇండ్ల నమూనాను స్టాల్‌లో ఏర్పాటు చేయాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, మహిళా శక్తికి సంబంధించిన స్టాళ్లను సిద్ధం చేయాలన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసేందుకు ప్రతిపాదనలు పంపాలని ఈ జాబితాలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పేర్లు కూడా పంపాలని, వరదల సమయంలో బాగా పనిచేసిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందేలా చూడాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులకు వాహనాలు ఏర్పాటు చేసి వేడుకల్లో పాల్గొనేలా చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర వేడుకలకు అవసరమైన మేర త్రాగు నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల కోసం పాఠశాల విద్యార్థులను తరలించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖాధికారికి సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, డిఆర్‌వో రాజేశ్వరి, ఆర్డీవో నర్సింహారావు, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభల్లో రగులుతున్న రాజకీయ చిచ్చు

**-గ్రామసభల్లో అధికారులను నిలదీస్తున్న ప్రజలు**
**-అధికారులకు తలనొప్పిగా మారిన గ్రామసభలు**



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమల్లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పక్కా ప్రణాళిక బద్ధంగా ఈనెల 26న మరో నాలుగు పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న క్రమంలో గ్రామాల్లో నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తపన పడుతుంటే అది ఆచరణ సాధ్యం కావట్లేదు తిరుమలాయపాలెం మండల పరిధిలో మొత్తం 40 గ్రామ పంచాయతీలో గ్రామ సభలు నిర్వహించేందుకు అధికారులు ఈనెల 21 నుంచి 23 వరకు ఏర్పాట్లు చేశారు.ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి వివరాలను మండల అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు పకడ్బందీగా వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఆ వివరాలు ప్రకారం గ్రామాలలో ప్రతి ఇంటికి తిరుగుతూ సర్వే చేసి వివరాలు సేకరించారు. ముఖ్యంగా ప్రజలు ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు రైతు భరోసా ఆత్మీయ భరోసా పథకాలకు ఎక్కువ దరఖాస్తు చేసుకున్నారు. కానీ అధికారులు గ్రామ సభలలో అధికార పార్టీకి చెందిన వారి కుటుంబాల పేర్లు ఎక్కువ వస్తున్నాయని గ్రామ సభలలో అధికారులను నిలదీశారు. మండల పరిధిలోని జల్లేపల్లి, పిండిప్రోలు, బచ్చోడు, తిరుమలాయపాలెం, ఎర్రగడ్డ తో పాటు పలు గ్రామాల్లో గ్రామసభలలో ప్రజలు తిరగబడ్డారు. దరఖాస్తు చేసుకోకపోయినా అర్హులు అయితే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని అవి నిరంతర ప్రక్రియగా కొనసాగుతాయని చెప్తున్న అధికారుల మాట వినే పరిస్థితి లేదు ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్లు రైతు బంధువు రైతు భరోసా పై తీవ్రస్థాయిలో ప్రజలు అభ్యంతరాలు పెడుతున్నారు. 2023 24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పని కనీసం 20 రోజులు పని దినాలు చేసి ఉంటే ఆత్మీయ భరోసా కు అర్హులని ప్రభుత్వం నిర్ణయించడం దీనిపై గ్రామాల్లో దుమారం లేస్తుంది దీనివల్ల ప్రజలకు సమాధానం చెప్పలేక అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లబ్ధిదారులు ఎంపిక ముందే ఇలా ఉంటే 26న లబ్ధిదారులు ఎంపికను ప్రకటిస్తే అధికారులు గ్రామాల్లో తిరగటం కష్టమే అని వివిధ రాజకీయ పార్టీ నాయకులు ప్రజలు అభిప్రాయపడుతున్నారు. దీంతోపాటు గ్రామాల్లో అతి త్వరలో స్థానిక సంస్థలు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే గ్రామాల్లో రాజకీయ సిచ్చు రాసుకుంటుంది. అధికారులు అధికార పార్టీ వారికి మద్దతు పలుకుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని కాంగ్రెస్ జెండాలు మెడలో వేసుకొని సంక్షేమ పథకాలు కాంగ్రెస్ కార్యకర్తలకు ఇవ్వండి అని ఎద్దేవా చేస్తున్నారు. జల్లేపల్లిలో అధికారులను నిలదీసిన వారిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాజీ సర్పంచ్ భాష బోయిన వీరన్న, గ్రామ నాయకులు దీవెల శ్రీనివాస్, పోట్ల జగదీష్, మట్ట హనుమంతరావు, నాగండ్ల ఉపేందర్, కన్మర్లపూడి శ్రీనివాస్ రావు, రమేష్, అనపర్తి ఉప్పలయ్య, తదితరులు ఉన్నారు.

# గ్రామసభల్లో గందరగోళం

**-అనర్హులకు ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు**
**-నాకు భూమి ఉంది.. ఆత్మీయ భరోసా వద్దు**
**-ఏపిలో ఉన్న వారికి రేషన్ కార్డులు మంజూరు**



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలంలో రెండవ రోజు 11 గ్రామాలలోగ్రామ సభలను అధికారులు నిర్వహించారు. ఉదయం కొత్త లంక పల్లి, మండాలపాడు, పాత కుప్పనకుంట్ల, పెనుబల్లి, కరాలపాడు, మధ్యాహ్నం కోంద్రుపాడు, కొత్త కారాయి గూడెం, లంకపల్లి, పార్థసారథి పురం, రామచంద్రరావు బంజర్, తాళ్లపెంట గ్రామాల్లో ప్రత్యేక అధికారులు గ్రామసభ నిర్వహించి నాలుగు పథకాల దరఖాస్తులను స్వీకరించారు. రామచంద్రరావు బంజర్, పాత కుప్పెనకుట్ల గ్రామాల్లో గ్రామసభలు రసాభాసగా మారాయి. రామచంద్ర రావు బంజర్, పాత కుప్పెనకుంట్ల గ్రామాల్లో సర్వే నిర్వహించిన అనంతరం పూర్తి అర్హులమైన తమకు ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు లిస్టులో తమ పేరు లేదని దరఖాస్తుదారులు వాగ్వాదానికి దిగారు. జాబితాలో అనర్హులకు చోటు దక్కిందని అర్హులైన తమకు చోటు దక్కలేదని అధికారులను నిలదీశారు. రామచంద్రరావు బంజర గ్రామంలో జాబితాలోని పేర్లు చదివి వినిపించాలని గ్రామ సభలో ప్రజలు పట్టు పట్టారు. అధికారులు అందుకు నిరాకరించడంతో వారి మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. సర్వే పారదర్శకంగా జరగలేదని సర్వే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి సర్వే నిర్వహించడంతో మంజూరు జాబితాలో తమ పేర్లు నమోదు కాలేదని ఆరోపించారు. పాత కుప్పెన కుంట్లలో ఎస్సై వెంకటేష్, రామచంద్ర రావు బంజర్ లో ఏఎస్ఐ సత్యనారాయణ పరిస్థితి చక్కదిద్దడంతో గ్రామ సభలు సజావుగా సాగాయి. దరఖాస్తుదారులు గ్రామసభలకి భారీగా తరలివచ్చి దరఖాస్తులను సమర్పించారు. పెనుబల్లి మండలంలో రెండవ రోజు మొత్తం 3721 దరఖాస్తులు అందాయి. ఇందిరమ్మ ఇళ్ళకి 1255, రేషన్ కార్డు1055, రైతు భరోసా251, ఆత్మీయ భరోసా కి 1160 దరఖాస్తులు అందజేశారు.

## హామీలను నెరవేర్చండి

**-అధికారులకు సిపిఐ వినతి**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే ప్రక్రియలో భాగంగా అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, నివాస స్థలాలు లేని పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు నూనె శశిధర్ కోరారు. బుధవారం త్రీటౌన్ పరిధిలోని 30వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఈమేరకు వినతి పత్రం అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా శశిధర్ అధికారులకు వాస్తవ పరిస్థితిని వివరించారు. త్రీటౌన్ ప్రాంతంలో నగరంలోనే అన్ని ప్రాంతాల కంటే పేదలు అత్యధికంగా నివసిస్తున్నారని అనేక దశాబ్దాలుగా నివాస స్థలాలకు నోచుకోలేదన్నారు. రెక్కాడితే కాని డొక్కడని పేదలకు రేషన్‌కార్డులు, నివాస స్థలాలు అందించాలని కోరారు. సొంత స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు భూక్యా రవీంధర్, దామర్ల రాము, నామ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఆత్మీయ పథకం భూమిలేని అందరికీ ఇవ్వాలి

**-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం భూమిలేని ప్రతి కూలి కుటుంబానికి అందే విధంగా చర్యలు చేపట్టాలని సిపిఐ ఆధ్వర్యంలో సత్తుపల్లి తహశీల్దార్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. బుధవారం సత్తుపల్లి మండలం రామానగరంలో జరిగిన ప్రజా పాలన గ్రామసభలో పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ మాట్లాడుతూ భూమిలేని పేదలందరికీ ఇవ్వాలని ఉపాధి హామీ పథకానికి దీనికి ఎలాంటి సంబంధం లేకుండా చూడాలని ఉపాధి హామీ పథకంతో సంబంధం పెట్టడం వల్ల వందల ఐదు మంది కూలీలు నష్టపోతున్నారని గ్రామసభలో పాల్గొన్న ఆయన ఆందోళన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సభలో కూలీలందరికీ ఈ పథకం ఇవ్వాలని తీర్మానం చేయించారు. అదేవిధంగా అర్హులైన పేదలందరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు, మహాలక్ష్మి పథకం అందే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి జగన్, రమేష్, లక్ష్మి కాంతమ్మ, పద్మ, కొండ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్సీ తాతా మధు



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** మండల పరిధిలోని గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలను అనారోగ్యంతో బాధపడుతున్న వారి కుటుంబాలను ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు తాత మధు పరామర్శించారు. మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామ శివారు పాపాయిగూడెం గ్రామానికి చెందిన రేపాకుల వెంకన్న ఇటీవల ఖమ్మం నగరంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్సీ తాతా మధు పాపాయిగూడెం గ్రామంలో రేపాకుల వెంకన్న నివాసంలో వెంకన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యుల ను ఓదార్చారు. అనంతరం అదే గ్రామానికి చెందిన సొంటి వెంకమ్మ అనారోగ్యంతో మరణించిన విషయాన్ని తెలుసుకున్న ఆయన ఆమె కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం పిండిప్రోలు గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పరికపల్లి బుచ్చి రాముల్ని పరిమర్శించారు. ఈ కార్యక్రమంలో పిండిపోలు మాజీ ఎంపీటీసీ పులుగుజ్జు వెంకటేశ్వర్లు, సొసైటీ ఉపాధ్యక్షులు చామకూరి రాజు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు పరికపల్లి చంద్రశేఖర్, రేపాకుల రవి తదితరులు పాల్గొన్నారు.

## అడసర్లపాడులో డిసిసిబి బ్రాంచ్ మంజూరు

**-మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో వేంసూరు మండలంలోని అడసర్లపాడులో నూతనంగా డిసిసిబి బ్రాంచ్ మంజూరైందని డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. వేంసూరు మండల పర్యటనలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అక్కడి రైతులు అడసర్లపాడులో నూతనంగా డిసిసిబి బ్రాంచ్ ఏర్పాటు చేయాలని కోరారు. రైతుల అభ్యర్థన మేరకు ఖమ్మం డిసిసిబి తరుపున ఆర్‌బిఐకి ప్రతిపాదనలు పంపించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మంత్రి తుమ్మల ఆదేశం మేరకు డిసిసిబి పాలక వర్గం సమావేశంలో తీర్మానించి ప్రతిపాదనలు పంపించారు. నాబార్డు, ఆర్‌బిఐ అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంప్రదించి అడసర్లపాడులో డిసిసిబి బ్రాంచ్ మంజూరు చేయాలని కోరారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనల మేరకు డిసిసిబి నూతన బ్రాంచ్‌ను మంజూరు చేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మంజూరుకు కృషి చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు డిసిసిబి అధ్యక్షులు దొండపాటి వెంకటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు, రైతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. త్వరలో అడసర్లపాడులో బ్రాంచ్‌ను ప్రారంభిస్తామని దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు.